

పడాల రాములు

ఆ ఊరి పేరు ఉసిరికపల్లె!

ఆ ఊర్ల కమస్కం నూరు కడపలుండొచ్చు.

ఊరికి జెరదూరంల మాలపల్లె ఉన్నది.

ఆడ మాలోండ్లయి, మాదిగోండ్లయి కలిసి నలపయి గుడిసెలుండొచ్చు.

మాలపల్లెకు ఇంక జెరదూరంల లంబడి తండున్నది.

ఆడ ఆరే గుడిసెలున్నయి. గంతనే:

రాజిరెడ్డి ఆ ఊరికి మాలి పటేల్.

ఆయన పెండ్లం పేరు ముత్యాలవ్వ వాండ్లకు పిలగాండ్లు లేరు. ఒక పిల్లున్నది ఆ పిల్ల పేరు తులసిబాయి. నిరుటిసంది ఇస్కూలుకు వోతున్నది.

రాజిరెడ్డికి నూరు ఎకరాల తరిభూమి

---

ప్రమాదిచ 1973 ఉగాది కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

న్నది. యాభై ఎకరాల కుష్కీ భూము న్నది. పది జోడీల ఎడ్లున్నయి. ఊర్లె సిల్లెర పజలంత ఆయన తాన మున్నూరు తులాల బంగారమున్నదంట సెప్పుకుంటరు. గది ఎంతమట్కు నువద్దెనో ఎంత మట్కు అవద్దమో ఆ దేవునికే తెల్వాలె.

ఆయన వయిసుల మాత్తరం నాలుగు పదులు లెక్కవెట్టిండు. సూడనీకి కర్రెగ పొటిగ, దొడ్డుగ కండ్లవడ్డడు. ఆయనకు సమువురాదు. గుమాస్తను వెట్టి పటేలుగిరి సేపిస్తున్నడు.

ఇసయం మరిసిన లంబడి తండల ఒక లఖి వున్నది. ఆమె పేరు చాందీ. రాజిరెడ్డి ఆమెను పదేండ్లకింద మరిగిండుట! గది తెలిసిన చాందీ మొగడు ఉరివెటుకోని సచ్చిపోయిండుట! గిప్పుడేమో చాందీ రాజిరెడ్డి ఉంపుడుగత్తె!! ఈ సంగతి ఊరివాండ్లు సెప్పుకుంటరు. గప్పుడు గప్పుడు సాటుకు!!!

అయాల అయితారం....

పొద్దుగలనే నాష్ట దిని, అరాంకుర్సీల కూసున్నాడు రాజిరెడ్డి సుట్ట తాగుత. ఆయన మనసు సోంచాయిస్తున్నది. ఈసాలు ఎన్ని ఎకురాల సెరుకుతోట వెటాలె? యెన్ని యెకురాల వరి నాటె యాలె? అచ్చ జీతగాండ్లు సుతి మెశాన తక్వున్నరు. నెలకింద నలుగురు లంబ డోళ్ళు వచ్చిన్రు. జీతముంట మంట. కాని వాండ్లకు ఎవుసాయపురోకు ఎక్వ తెల్వది అందుకోసానికే తన మనసొప్పలే. వాండ్ల నుంచుకోనీకి "మస్తుగున్నరు. వద్దంట" సెప్పిం తోలిచ్చిండు.

"నాయినా!" అంటవచ్చి తండ్రి తాన నిలవడది తులసిబాయి.

ఆయన ఆలోసెనల దండ పుటుక్కున తెగిపోయింది.

"ఎంది తులసీ?" అంటడిగిండు.

"అమ్మ రమ్మంటున్నది నిన్ను"

"ఏమిటికి?"

"బువ్వ తిననీకి"

"ఇప్పుడే నాష్ట దిన్నగద. ఆకలయితలే. జెర సేపయినంక వస్త పో."

తులసిబాయి వంటసాలదిక్కు నడిసింది.

"ఇగో. తులసీ!" అంట ఎనక్కు పిలిసిండు రాజిరెడ్డి. తానకొచ్చి "ఏందన్నట్టు" సూసింది, ఆయిన ముకంలకు.

"మి అమ్మేం సేస్తున్నది లోపట?"

"ఇప్పటిదాక సల్ల సేసింది. ఇప్పుడేమో ఎన్నదీస్తున్నది"

"అచ్చ. నేను పండుకునే అర్రలగూటె దస్తి రుమాలున్నది. జెర తిస్కస్తావు?"

"ఆ."

తులసిబాయి ఎల్లిపోయిందాడికెల్లి.

ఇంతలకు ఈధి వాకిట్లకెల్లి—"పటేలా! ఓ పటేలా!!" అంట ఎవలో పిలిసిన్రు.

"ఎవడ్రా వాడు?"

"నేనే బాంచెన్."

గది ఎవలి మాటనో ఎరికె వట్టిండు రాజిరెడ్డి.

"ఎవడు? తలారి బాలుగాడా?"

"అవ్. బాంచెన్."

రాజిరెడ్డి సేతిలసుట మలిపి పారేసిండు. కుర్సీలకెల్లి లేసి నిలవడ్డడు. తులసిబాయి రుమాలు తెచ్చి తండ్రిసేతి కిచ్చింది. గది నెత్తికి సుట్టుకోని ఈధి కడప దాటిండాయన.

"దండాలు పటేలా!" బాలయ్య వంగి దండంబెటిండు. అతనెంబడి ఒక వయిసు పిలగాడున్నడు.

"ఆ. ఆ. దండం దండం" అంటఅరుగు మీద కూసున్నడు రాజిరెడ్డి. కూసుంట ఇట్లడిగిండు.

"ఏంరా, బాలుగా! శాన దినాలకు కండ్ల వడ్డవ్?"

"ఏం సెయ్యాలె, పటేలా! పొలం పనితోని పుర్సతు దొరుకతలే. ఆడనే మల్లాడుడయితున్నది. యాల్లకొచ్చి బువ్వగిట్ట దిని మల్లాడికే పోతున్న. లేకుంటే దినాం రొండుసార్లు వచ్చి సలాం పెట్టి పోకపోదునా?" అన్నాడు బాలయ్య.

"అవ్‌గనీ- వీడెవడ్రా!" నేనెప్పుడూ సూడలే. మన ఊరయితే గాదు. మి సుట్టపోడా?" అంటడగిండు రాజిరెడ్డి ఆ పయిసోన్ని సూస్త.

"అవ్, పటేలా! వీడు నా మేనమామ కొడుకు. మెదక్ పక్కపొంటి అంబోసిపల్లెలేదా? గదే వీని సొంతూరు. ఆడ నిరుటి సంది కరువు వడ్డది. మొత్తం ఊర్ల పుటెడు గింజలుగూడా పండుతలేవు జీతముండి బతుకుతనంట నాతానకొచ్చిండు" అంట సెప్పిండు బాలయ్య.

"అటనా?" అన్నడు రాజిరెడ్డి.

"వీన్ని యీసాలు జీతముంచుత ఇన్నూరురూపాలు గొంచబోయి వీనయ్యకిస్త. వాడూ, పెండ్లమూ గాసం కొనుక్కని దినమెలదీస్తరు. ఆ రూపాలు తేరిపోంగనే మల్లిన్నూరు గొంచబోయి లగ్గం సుతిమె నేనే సేస్త. ఫలానోడు సేసిండంట పేరనొస్తది. ఏమంటవ్ పటేలా?" అన్నడు బాలయ్య.

"ఇండ్ల అనని కేముందిరా? బామ్మర్దికి బతుకుతెరువు సూపిస్తున్నవ్. మంచిదే లగ్గంగిట్ట సేస్తనంటున్నవ్. పున్నెంవస్తది అంతేగాక వీడు బతికినన్ని దినాలు నీపేరు యాదిసేస్కుంటడు. గదేసాలు" అంట బాలయ్యతని, ఆ పయసోనిదిక్కు ముకమితె—



"మిథునం"

చిత్రం : ఈశ్వర్, కాకినాడ-3

---

"నీపేరేందిరా?" అంట డిగిండు రాజిరెడ్డి.

"రాందాసు" అన్నడతడు.

"ఎవుసాయపు పని వస్తదా?"

"ఆ! సిన్నప్పటిసంది ఆ పనే సేస్తున్న పటేలా! దుక్కిదున్నొస్తది. రాపొస్తది. వరికుప్పపెడ్త. కొడ్త. మోట కొటొస్తది. తాల్లు పగ్గాలు. వార్నెలు, తలుగులు గిట్ట పేనొస్తది. ఎరువుబండ్ల మిరిస్త. పచ్చి గడ్డి కొయ్యొస్తది. ఎండుగడ్డి వాము పెట్టొస్తది" అన్నడతను.

"ఏంరా. బాలుగా! గియి నువద్దెనేనా? లేకుంటే వీని బాతకాలా?" అంటడిగిండు రాజిరెడ్డి నగుత

నువద్దెనే పటేలా! నాల్రోజులు పని సేసినంక నీకూ ఎరికెయిపోతది" అన్నడు బాలయ్య.

జెర సేపు ఎవలూ మాట్లాడలే.

బాలయ్యకు కాలు గుంజవటినయి. కింద గొంగడేసుకోని కూసున్నడు. పక్కపొంటే రాందాసుకూడ దొగ్గల్లమిద కూసున్నడు.

రాజిరెడ్డి బాలయ్య ముకంలకు సూస్త, "అరే బాలుగా!" అంటన్నడు.

"ఏంది పటేలా?"

"వీన్ని జీతముంచుతవన్నమాట"

"అవ్. బాంచెన్"

"ఎన్ని రూపాలు గావాలె?"

"సెప్పిగద గులాపోణ్ని. ఇన్నూరు"

# బలి

"మల్ల జీతం ఎంతియ్యి మంటవ్?"

"దునియల ఎట్లిస్తున్నరో నీకు తెల్వదా పటేలా?"

"ఉహూ.... నివ్వే సెప్పురా. ఎంతిస్తున్నరో?"

"సెప్పేటిదేంది బాంచెన్? నీ కాల్ల కాడనే పదిమంది జీతగాండు బతుక్కుతున్నరు. వాండ్ల కెట్లిస్తున్నవో వీనిగ్గూడ గట్లనే ఇయ్యి పటేలా!"

"ఇగో. ఇను. వాండ్లకు నెలకు ఇరువయి రూపాలిస్తున్న. దుంబాలయినంక తూమెడు వడ్లు, కుంచెడు జొన్నలు పెట్టువడినాం ఇస్త. ఒకపూట దూపగంజి బోపిస్తున్న. రోజు నాలుగు దోన్‌బీడీ లిప్పిస్తున్న. గంతనేరా."

"సాలు పటేలా! శాన మంచిగిస్తున్నవ్ వీనికి సుతిమె గట్లనే ఇయ్యి. బారాల్ పని బాగసేసే బారం వీని నెత్తిమిదుంటది."

"అచ్ఛా. పనిమీదికి ఎప్పటిసంది తోలిస్తవ్? రా"

"ఎల్లుండి మంగలారం సంది"

"మంచిది. రేపు పొద్దుగలనేవచ్చి కాయిదం రాపిచ్చుకో నీ రూపాలు గొంచబోరా. ఎందుకో సాని కంటే ఇయాల గుమాస్త రాలే"

"అట్లయితట్లాయె బాంచెన్. రేపిద్దరం గూడవస్తం" అంటసెప్పి, లేచి మాలపల్లె దిక్కు నడిసిన్రు బాలయ్యా, రాందాసూ.

* * *

"అరే రాందాసూ!" అంటన్నడు రాజిరెడ్డి.

"ఏంది పటేలా?" అంటడిగిండు రాందాసు.

"నివ్వియాల అడివికి బోవాల్లె పొయ్యిలకు తమాం కట్టెల్లేవు. వంటకు శాన తక్లీబయితున్నది. నీ ఎంబడి ఇంకో మనిసిని తోల్కపో. ఇద్దరుగూడి పొద్దు మీకేతలికి బండెడు కట్టెలు కట్టుకోని రండ్రి"

"వద్దు పటేలా. ఇంకో మనిసేమిటికి? కూలి పైసలు దండుగు. నేనొక్కణ్నె బోత బండెడు కట్టె కొట్టుకస్తం సుతారమా?"

"ఎనీకే శాన కష్టమయితదిరా. అందుకో సానికే గట్ల సెప్పిన."

"పర్వలేదు పటేలా! ఒక మంచి గొడ్డలియ్యి. రొండు గట్టి పగ్గాలియ్యి"

రాజిరెడ్డి ఇంట్లకువోయి గయి తెచ్చిచ్చిండు. ఆయనంక ఇట్లన్నడు—

"ఇదుగో. మట్టెవాడ బండి కొట్కపోయేవ్? గది బాగలే. దాని సర్నాలు ఇరిగిపోయినయి. గాడిబండి కొట్కపో కొత్తగ దెచ్చిన ముతె కోట ఎడ్లున్నయి సూడు. గయి కట్కపో. జెల్దిన మర్రి రావాలె. లేకుంటే సవుకిదారు వట్టుకుంటడు. ఎరికెయినాదిరా?"

"అట్లనే పటేలా! దొబ్బునొస్త" అంట ఎల్లిపోయిండు రాందాసు, బండికట్టుకొని.

పొద్దాలింది.

రాందాసు బండి కొట్టుకొచ్చి, ఇంటి ముందట ఇడిసిండు. అండ్ల కట్టెలు సన్న గుట్ట లెక్క కండ్ల వడ్తున్నయి.

రాజిరెడ్డి అబ్బురవడ్డడు. "వీడు బేత్రీన్ పనికా డున్నటున్నడు కాకుంటే గిన్ని కట్టెలు ఒక్కడు కొట్టగల్తడా?" అంటను కున్నడు మనసుల.

జీతగాండ్లు— "అబ్బో, వీడు పన్ల తీసు మార్కాడున్నట్టున్నడు. లేకుంటే ఇద్దరి కష్టం ఒక్కడే సేయగల్తడా?" అంటను కున్నరు మనసుల్ల.

* * *

సందెయాల—

జీతగాండ్లు దూపగంజుల తాగుతున్నరు ఇస్రాల్లకాడ. ముత్యాలవ్వ అందరికీ తయిదు అంబలివోసి, సింతకాయ తొక్కు సేతుల్ల వెట్టింది. వాండ్లు ముచ్చట్లు సెప్పుకుంట, అంబలి తాగుకుంట, తొక్కు నాకవట్టిన్రు.

సుట తాగుత ఆడికొచ్చి నిలవడ్డడు రాజిరెడ్డి.

వాండ్లు ముచ్చట్లు బందుసేసిన్రు.

"అరే పోసిగా! ఇయాల మిరేంపని సేసిన్రురా?" అంటడిగిండు రాజిరెడి, ఒక ముసలి జీతగాన్ని. ఆయన నిన్న రెయ్యి సంది ఇంటికి రాలే. లంబడి తండలనే గడిపిండు

"మేమా పటేలా? నాగండ్లకు తాల్లు పేనినం" అన్నడు పోసిగాడు.

"నివ్వు ఎన్ని పేనినివ్‌రా?"

"మూడే పటేలా!"

ఇంకో జీతగాన్ని—"నివ్వు ఎన్ని పేనినవ్‌రా సంగదాసూ?" అంటడిగిండు రాజిరెడ్డి.

"నాలుగు" అన్నడు సంగదాసు. మల్లో జీతగాన్ని అడిగిండు – "అరే బూదిగా! నివ్వు ఎన్ని?"

"ఐదు అన్నాడు" బూదయ్య.

వర్సగ అందర్నడిగిండాయన. ఎవలు ఎన్ని పేనినో సెప్పిన్రు వాండ్లు. ఎవలూ ఆరు తాల్లకంటే ఎక్వపేనలే.

కొనాకు రాందాసు నడిగిండాయన— నివ్వు ఎన్ని పేనినవ్‌రా, రాందాసూ!" అంట.

"పదకొండు పటేలా!" అన్నడు రాందాసు.

"లెబాస్! అందరూ అంబల్లు తాగినంక వీని కాల్లు మొక్కుండ్రి. గుణమొస్తది. ఆయెన్క పనొస్తది." అంట రాందాసును మెచ్చుకోని, మిగిలిన జీతగాండ్లను తిట్టిండాయన.

ఎవలూ నోరెత్తలే. సప్పుడుదాక తాగి గిన్నెలు కడుక్కోని ఎల్లిపోయిన్రు.

* * *

ఒక దినం—

అంబటి పొద్దయింది.

వంటసాలెల పీటెమిద కూసున్నడు రాజిరెడ్డి. ముత్యాలవ్వ గిన్నెలబువ్వ కూర వడ్డించి ఆయన ముందర వెట్టిండు. దబ్బదబ్బ తిన వట్టిండాయన.

జెర దూరంల తులసిబాయి నిలవడి తండ్రిదిక్కు సూస్తున్నది. గది ముత్యాలవ్వ కండల్ల వడ్డది.

"ఏమే తులసీ! అట్లసూస్త నిలవడ్డవ్. ఇస్కూలుకు బోవా?" అంటడిగింది.

"బువ్వవెట్టు. తినిపోత" అన్నది తులసిబాయి.

"ముందుగల కాల్లుసేతులు కడుక్కోని కూసో.

నే గిన్నెకడిగి బువ్వవెడ్త" అన్నది ముత్యాలవ్వ.

తులసిబాయి కుండీకాడికి వోయింది. సెంబుత నీల్లు ముంచుకోని కాల్లుగిట్ట కడుక్కున్నది. సేతిని లంగాకు తుడుసుకుంట వచ్చి తండ్రి పక్కపొంటి సాపేసుకోని కూసున్నది. ఇవతలకు అవుతలి కెల్లి— "పటేలా!" అంట పిలుపు ఇనొచ్చింది.

"ఆ" అంట పలికిండు రాజిరెడ్డి.

ముత్యాలవ్వ తులసిబాయితో— "ఎవలో సూస. తింటున్నడంట సెప్పి రాపో, జెర సేపు కూసోమను" అంట సెప్పింది.

ఆ పిల్ల లేసిపోయి అట్లనే సెప్పొచ్చింది.

"ఎవలు, వచ్చినోడు?" అంటడిగుండు రాటారెడి.

"ఎవలో పుల్ల మిసాలోడు. వాని పేరు తెల్వది నాకు" అన్నది తులసిబాయి.

రాజిరెడ్డి, ముత్యాలవ్వ నగిన్రు.

తులసిబాయికి గది మంచిగనిపియలే. తల్లిత ఇట్లన్నది—

"అమ్మా! నాకు జెల్దిబువ్వ వెట్టు. ఇస్కూలుకు టయిమయింది. ఆలిసెంగ బోతే మా 'సారు' పిస్కలు తీపిస్తడు. పులిసెరిబరిగెత దెబ్బలు గొడుతడు."

"కూసో. పెడ్త" అంట ఎల్లి గిన్నె కడిగి, బువ్వ వెట్టింది ముత్యాలవ్వ. అంచుకు దప్పుడంబోసింది. ఆ పిల్ల తిన 'శురు' సేసింది.

రాజిరెడ్డి తిని, లేసి సెయ్యికడుక్కున్నడు గిలాసెడు మంచినీల్లు తాగి "బేవ్" మంట బేకోటు తీసిండు.

"అయ్యో, మారు బువ్వ పెట్టుకోక

పోతివి, పెరుగుగూడ ఏసుకోలే ఎందు కోసానికి?" అన్నది ముత్యాలవ్వ.

"అబ్బో. గిప్పటికే కడుపు బరువయింది. అన్నడు రాజిరెడ్డి సిన్నగ నగుత.

ముత్యాలవ్వ ఇగేం మాట్లాడలే బొడ్డు కాడ సెక్కుడు సంచిలకెల్లి ఒక పోక క్క ఒక లవంగం తీసచ్చింది. గయి నోట్లేసుకోని యివుతలి కొచ్చిండాయన.

బాలయ్యా కండ్ల వడ్డడు!

సటుక్కునవంగి దండం బెటిండు.

"నువ్వారా బాలుగా! ఇంకెవరో అను కున్న. ఇయాల పొలంకాడికి బోలే" అంట పల్కరిచ్చిండు రాజిరెడ్డి.

"లే. బాంచెన్" అన్నడు బాలయ్యా.

"బువ్వగిట తిన్నావురమల్లా?"

"బియ్యం యాడున్నయి పటేలా బువ్వదిననీకి రొండు మక్కరొట్టెలు దిని తయిదంబలి తాగొచ్చిన గంతనే."

"నువదెనా?"

"నా పెండ్లంతోడు పటేలా! నీకు అవద్దం సెప్తనా?"

"గది సరేగనీ— ఇట్ల వచ్చినవేందిరా? గాసంగిట్ల కావాల్నా?"

"కాదు పటేలా! ఏరే పనిమీదొచ్చిన."

"యేంది?"

బాలయ్యా ఎంబడే నోరు ఇప్పలే.

"మాటాడవేందిరా? ఏం గావాలె? జెల్ది సెప్పుమల్ల. నేను పొలంకాడికి బోవాలె. సల్లకొచ్చి ముంతదాస్తే బాగుంటాది? సెప్పు."

"మల్లేంలేదు బాంచెన్, రాందాసుకు నిన్న పిల్లను సూపొచ్చినం. సిద్దిపేటకాడ సోంపల్లె లేదా? ఆ ఊర్ల సంగదాసు అనే పెద్ద మాలోడున్నడు. వాని పెదబిడ్డె."

"అట్ల సెప్పవేందిరా? గిది మెప్పునీకి ఇంతాలిసెమా? పోరి బాగున్నదా? ఎన్నేండ్లుంటది?"

"మొన్నటి మిర్గానికి ఇర్వయ్యేండ్లు వడ్డయట. పోరి మాత్తరం ఎర్రజాంపండు లెక్క పసందుగున్నది" నగుతన్నడు బాలయ్యా.

"అట్లనా? వాండ్లది ఉన్న సంసార మేనా?"

"ఆ. పొట్టకు, బట్టకు తుటిలే. పరాయి వానికి ఆసవడకంట, అప్పు సప్పు లేకుంట నియత్‌గ బతుకుతున్నరు.

"గంతనే సాలు. లగ్గం ఎప్పుడు పెట్టుకున్నర్రా మల్లా?"

"వచ్చే అమాసెల్లినంక మూడు దినాలకు"

"ఐతే నివ్విపుడు రూపాల కోసానికి వచ్చినవన్నమాట"

"అవ్. పటేలా"

"ఎన్నిగావాలె"

"మున్నూరు"

"అబ్బో. గన్నిరూపాలా? ఎప్పుడు గావాలె మల్లా"

"అవటాల ఎల్లుండి మెదక్‌కుబోయి సొమ్ములు. బట్టలుగిట్ట కొనుక్కొస్త. రేపు ఇయ్యి బాంచెన్".

రాజిరెడ్డి జెర్రసేపు సోచాయించిండు గన్ని రూపాలు ఇయ్యాల్నా వద్దా? ఆ రూపాలిస్తే ఇద్దరు కొత్త జీతగాండ్లు ఊడిగెం సేత్తరు. కాని రాందాస సొంటి పనికాడు పన్నకెల్లి ఎల్లిపోతే తన యెవుసాయం దెబ్బదింటది గరిసెలు దివాల్ దీసయి ఇసైవాయె మున్నూరేగద! వాని రెక్కలు సల్లగుంటే నాల్రోజులు ఎక్వ కషం సేసి రూపాలన్ని తేర్పుకుంటడు అంటనుకోని—

"ఇగో సూడురా బాలుగా!" అంటన్నడు బాలయ్యా ముకంలకు సూస్త

"సెప్పు పటేలా?" అన్నడు బాలయ్యా

"రూపాలు రేపు సుదురాయించి పెట్త ఎల్లుండి పొద్దుగలనే వచ్చి గొంచబో"

"మంచిది బాంచెన్. ఎడ్లకు నీలు తాగి పియ్యాలె. పోతమల్లా" అంట ఎల్లి పోయిండు బాలయ్యా.

రాజిరెడ్డి ఇంట్లకుబోయి అంగిగిట్ట తొడుక్కోని పొలం దిక్కు బయలెల్లిండు.

ఒక నెలరోజులు గడిసినయి.

రాందాసు లగ్గం శాన సామాన్నెంగయి పోయింది. అతని పెండ్లాం పేరు గంగి. ఆమె సన్నగ పొడుగ్గ బంగారి సలాకు లెక్కున్నది. ఆ ఊరోల్లంత ఆ ఇద్దరికీ ఈడుజోడు బాగగుదిరింది. సిలక గోరింక లెక్కున్నరంట సెప్పుకోవట్టిను.

"గంగి సమర్తాడి మూడు నెల్లయిందట!

రాందాసు సుతిమె జోరు వయిసులున్నడుగద!

ఇంక సూసేటిదేమిటికి?

ఎల్లుండి దశిమినాడు మంచి దినమట!

అయాల రెయ్యికి ఆలుమొగలను ఏకం సేతాం అంటనుకున్నరు ఆడి సుట్టాలూ. ఈడి సుట్టాలూ. ఆ ఇద్దరి తలిదండ్రుల మనసులు మురిసెంలవడ్డయి.

బాలయ్యా కుషిత పొంగిపోయిండు. బామ్మర్దికోసానికి కొత్త సెలెలుకోసానికి నలుగురు కులపోల్లను పట్టుకోని మంచి గుడిసెపిచ్చిండు. వడ్ల ఎంకటసామికి ఇనామిచ్చి టేకు సెక్కలత తలుపు సేపిచ్చిండు. గది ఆ గుడిసెకు అమిరిచ్చిండు. గుడిసె సూసిన సుటాలంత శాన బాగున్నదంట మెచ్చుకున్నరు.

ఆయాల దశిమి—

ఎన్నెల జొన్నపిండి ఆరబోసినట్ల కండ్లవడ్తున్నది. సల్లగాలికి శెట్లు నెత్తులూపుతున్నాయి. మొగుల్ల సుక్కలు తల తల మెరుస్తున్నయి.

రాందాసును, గంగిని కొత్త గుడిసెలకు దోలి తలుపు వెట్టి, పక్కుమంట నవ్వుకున్నరు మాల మూత్తయిదలు.

ఆ గుడిసెల ఎర్రమన్నుత సున్నగ అలికిన్రు. ముగ్గులేసిన్రు సందూకమీద కందీలు ఎలిగిచ్చి పెట్టిన్రు.

ఒక సాపమీద కరేసిన నల్లగొంగడి పరిసిన్రు దానిపైనెతెల్లటిదుప్పటి పరిసిన్రు తలాపుకు రొండు మెత్తలేసిన్రు. ఆ బటలకు జెరదూరంలో రొండు ఇత్తడి సెంబుల్లనిండా నీల్లువెట్టిన్రు.

గుడిసెల గంగి నెత్తిదించుకోని, ఎడం కాలిబొటనేలుతోని నేలగీతలుగీయవటింది. ఆమెకు జెరదూరంల నిలవడ్డ రాందాసు—

"పిల్లా!" అంట పిలిసిండు మెల్లంగ.

గంగిపల్కలే. తలలేపి రాందాసు కండ్లకు సూసింది. సిగుత.

"మాటాడవేంది పిల్లా! నీకు మాటలు రావాయేంది?" అంటడిగిండు రాందాసు.

ఐనా గంగి నోరు ఇప్పలే.

రాందాసు ముందుకు నడిసిండు. సేతులు సాపి ఆమెను దగ్గరికి లాగి, సెతిపేల్లత సంకల్ల గులగుల సేసిండు. ఆమె కిలకిల నగింది.

అతడు నగుత గంగిని సందిట్లకు లాక్కోని నొసలుమీద తన పెదవులు మెదిపిండు. ఆమె మనసు కుషిత పొయ్యి పైని పాలలెక్క పొంగిపోయింది.

"వదులు మామా!" అంట ఇడిపిచ్చుకునబోయింది.

ఆ మాటలు పసందు గినవడ్డయి రాందాసు సెవులకు.

"పిల్లా! మరోపారి పిలువ్ మామా అంట. నీ మాటలు బెల్లపు పాన్కం లెక్కున్నయి. ఊ పిలువ్ మల్లా" అన్నడామె కండ్లల్లకు సూస్త.

ప్రసవించేదాకా
ప్రెగ్నిటోన్ ఉపయోగము
(రిజిష్టర్డ్)
ప్రథమ మాసముల వేవిళ్ళు, వాంతులు, మధ్యమాసముల నీరుమాపుట, నీరసము, గర్భస్రావ భయము, తర్వాత మాసముల గర్భవాతము.రక్తహీనత, అకాలప్రసవము వీటినుండి రక్షించుచు, సుఖ ప్రసవము నిచ్చును.
అన్ని మందుల షాపులలో లభించును.
ఓషధి ఫార్మస్యూటికల్స్.
గుడివాడ. (కృష్ణా)

## బలి

"ఊహూ!" అన్నది గంగి.

"ఏమయితది? నోట్ల ముత్యాలరిగిపోతయా?"

"నాకు సిగ్గయితది" అన్నది నేలదిక్కు సూస్త.

"అట్లనా?"

"ఊ"

ఇంతల గంగి సీరెకొంగు జారిపోయింది

రాందాసును పెయ్యి, మనసు సెంచలాలు ఒక్కపారే ముసురుకున్నయి. ఆమెను అనాదనంలేపి ఎత్తుకోని బట్టల మీద పండబెట్టిండు. గంగి పెయ్యి పుల్కరిచ్చింది.

"అబ్బా, కందీలు ఎలుగు కండ్లల్ల వడ్తున్నది" అన్నది కండ్లు మూసుకుంట.

రాందాసుకు నగొచ్చింది. దబ్బున లేసి కందీలు మలిపేసి గంగి పక్కల సేరిండు. అతన్ల ఉశారు ఎక్వయింది.

గుడిసె పక్కపొంటున్న గన్నేరు సెటు మిదికెల్లి కోకిల తియ్యంగ కూసి ఊకుంది.

* * *

రాజిరెడ్డి మోటబాయికాడ కోతవట్టిపిచ్చిండు. ఆడ ఆయనకు పదెకురాల పొలమున్నది. అండ్ల ఆరెకురాల ముచ్చుల వరి నాటేపిచ్చిండు. నాలుగెకురాలు కిష్న కాటికెల వరి నాటేపిచ్చిండు. వరి కర్రలను సూస్తే పొలమంతగలిసి ఇర్వయ్యెదుపుట్ల వడ్లయితుండొచ్చు నన్పిస్తున్నది. గంత బాగున్నది!

అరువయిమంది మొగవాండ్లు, నలపయిమంది ఆడవాండ్లు కొడవండ్లు వట్టుకోని వరిని పరపర కోసేస్తున్నారు.

రాజిరెడ్డి గటుమీద కూసోని సుట్ట తాగుత కోత దిక్కు సూస్తున్నడు.

కోత జోరు ఎక్వయింది.

జీతగాండ్లు పాట పాడ శురు సేసిర్రు,

"ఈడంటడు నా లంజె

ఆడంటడు నా లంజె.

ఇంజెనుకాడి అంజయ్యా!"

మొగవాడ్లందరు — "నేనెవ్వని లంజెనురో.

ఇంజెనుకాడి అంజయ్యా!" అంట పాషిత నగవట్టిర్రు. ఆడవాండ్లకు తిక్క పుట్టుకొచ్చింది.

'గిదేం పాట య్యోవ్? వట్టి మోటు పాట గిది బంద్ సేసి ఇంకో మంచి పాట పాడుండ్రి. లేకుంటే నోర్లు మూస్కోండ్రి" అంట గయ్యిన లేసిర్రు.

నగొచ్చింది రాజిరెడ్డికి.

ఒక జీతగాడు- "మంచి పాటలు మాకు రావు అన్ని తిర్రిపాటలే వస్తయి. మా రాందాసు శాన పసందు పాటలు పాడ్తడు. పాడనీకి వాడు లేడు. ఇయాల పనిమీదికి రాలే" అంటన్నడు.

రాజిరెడ్డికి అగ్గిసురుకు అంటినట్టయింది. తను ఇంతసేపటి సంది కోత సూసుకుంటునే కూసున్నడు. కానిజీతగాండ్లందరు వచ్చిర్రో రాలేదో సూడలే. ఐతె రాందాసు పనికాడికి రాలేదన్నమాట. యాడికి బోయిండో? పనిడిసిపెట్టి యాడికీ బోయేటోడుగాడు. మల్ల ఇంటికాడేం సేస్తున్నడు! ఓహో, కొత్తగ లగ్గమయిందిగద! పెండ్లంతోని పరాశికాలాడుకుంటుండొచ్చును. కోతలవకు ఇట్లననాగా సేస్తే ఎట్ల? పని కరాబయితది. ఈ కోతయినంక వాని గుడిసెకు వోయి బెదిరిచ్చిరావాలె" అనుకున్నాడాయన మనసుల.

సేతిల సుట్ట పారేసిండు.

పొద్దుగూకే యాలయింది.

కూలివాండు, జీతగాండ్లు కోత బంద్ సేసి నిలవడ్డరు. సీరెలు, ధోతులు గిట్ట సదురు కోవట్టిర్రు.

"ఆపేసినేర్రిందిరా? దమ్ముకొచ్చిందా? గిప్పుడే ఇండ్లకువోయి ఏంసేత్తరు? ఊకెనే కూలవడ్తరు కాల్లు సాపుకోని. ఇంక అయిదుమల్లు మిగిలినయి. ఇగ ఒక్కమడి కోసి పోదురుగని వంగుండ్రి కొయ్యనీకి" అండరిసిండు రాజిరెడ్డి.

"ఇంకేం పొద్దున్నది పటేలా! సూరీడు గూకెవడ్డడు. గిప్పుడుమేం ఇంటికివోయి కూడుగిట్ట వండుకోవాలె. మేం నియత్‌తోని కోసినం. రేపు వచ్చి మిగిలింది కోసిపోతం. ఇగ మమ్ములను బలిమి పెయ్యకు పటేలా!" అంట బతిమిలాడిర్రు కూలివాండ్లు.

"అచ్చ, ఇయాల జెర పొద్దెక్కినంకొచ్చిర్రు. రేపు ఇంక ముందుగలనే రండ్రి" అంట సెప్పిండు వాండ్లత. ఆయెన్క జీతగాండ్ల దిక్కు ముకమయిత ఇట్లన్నడు:

"మీరు ఇంకా నిలవడ్డరేందిరా? పోండ్రి. ఎడ్లకు పిండివెట్టి గడ్డి గిట్ట ఎయ్యిపోండ్రి"

వాండ్లు కదల్లే.

రాజిరెడ్డికి కోపమొచ్చింది.

"నేను సెప్పేటిది ఇనవడ్తలేదురా?" అంటన్నడు మల్లా.

"గూలాపోల్లం పటేలా!" అన్నరందరు బదులుకున్నవాండ్ల లెక్క.

"ఏందిరా, ఏంగావాలె?" అంటడిగిండాయన.

"ఇయాలతోల్త కోతగద పటేలా! గదివొంగ కష్టం సుతిమె శానయింది. కోసి కోసి నడుములు నొప్పివెట్టినయి. జుట్టుకో సీస కల్లు సెప్పు. నీ కాల్లు మొక్కుతం" అన్నరు వాండ్లు.

కూలివాండ్లు ఆసత సూస్తున్నరు.

రాజిరెడ్డి—"ఒక దిక్కుకెల్లి కరువు వడ్తున్నది. కల్లు తాగుతరట తాగుబోతు లంజె కొడుకులు. అందుకోసానికే మీకు బర్కత్ లే. ఆ కల్లు పైసలు వెడ్తే అద్ద కిల బియ్యం రావూ? గయి వండుకదిని పండుకుంటే పెయ్యి సుకంగుంటది. కాని కల్లు తాగుతేమొస్తదిరా? అండ్ల గుల్ పారం కల్పుతరట. సెకిరీన్ పోస్తరట. గయి వెయ్యిని కరాబుసేసి పారేస్తయి. ఇగేమన్న ఆయెగని, నోరిడిసి అడిగిర్రు. ఇయాల తాగి రేపటిసంది మానెయ్యుండ్రి. ఎరికెయిందా?" అంటూ జేబులకెల్లి రెండు పదిరూపాలనోట్లు తీసిచ్చిండు.

"మంచిది పటేలా! నివ్వు సెప్పినట్లే సేస్తం" అంట గయి తీసుకున్నరు వాండ్లు.

కూలివాండ్లు కుషివడ్డరు. జీతగాండ్ల పున్యాన కల్లు దొరికిందట.

"మా పటేలు కడుపు సల్లగుండాలె. పదిపుట్ల వడ్లు ఎక్వపండాలె" అంట దీవెనార్తిచ్చిర్రు.

రాజిరెడ్డి—"రేపు కోతయినంక కమికీల్లు పట్కపొండ్రి. సీకటివడ్తున్నది. జెరయితే కల్లుగూడయిపోతది. ఇగ పొండ్రిమల్ల" అంటసెప్పిండు కూలివాండ్లకు.

సంబూరంతోని ఎల్లిపోయిర్రందరు.

రాజిరెడ్డి గట్టుమీదికెల్లి లేసి, సర్రాసుగ మాలపల్లె దిక్కు నడిసిండు. ఒక గుడిసె ముందట నిలవడి—

"రాందాసూ! అరే రాందాసూ!!" అంట పిలిసిండు.



మొలక నవ్వు

"ఆ! ఎవలూ?" అంటడిగింది లోపటి కెల్లి ఎవరో ఆడమనిసి!

"నేను మాలి పటేల్‌నే. రాందాసు కోసానికి వచ్చిన. వాడున్నడా?"

"అ" అంట ఇవుతలి కొచ్చింది. ఒక పడుసుపిల్ల.

ఆ పడుసుపిల్లను పెయ్యంత కండ్లు సేసుకోని సూడవటిండు రాజిరెడ్డి. ఆ పిల్ల తెల్లటి సిరె కట్టుకున్నది. పచ్చటి రయికె తొడుక్కున్నది. నొసలు మిద దారాణ బిల్లంత బొట్టు వెట్టుకున్నది ఆయన కండ్లకు కానపసందుగ కిండ్లవడ్డది.

"ఎవలే నివ్వు? రాందాసు పెండ్లంవా?" అంటడిగిండు.

ఆ పిల్ల సగ్గువడ్త – 'ఆ' అన్నది మెల్లంగ.

"నీ పేరేందే?"

"గంగి"

రాజిరెడ్డి గంగి ముకంలకు, ఆమె తొడుక్కున్న రయికెలకు ఎర్రి సూపులు సూడ వట్టిండు. గది కనిపెట్టింది గంగి. శాన సిగ్గయింది తల తిప్పుకోని దూరంలకు సూస్త నిలవడది. "గీ పటేలు ఇట్ల సూస్తడేంది? తనకేమో కాల్లు వనుకుతున్నయి ఆయన ఎదురుంగు నిలవడాలంటె? జెల్దిన ఈడికెల్లి బోతే బాగుండును" అనుకున్నది మనసుల.

"ఇగో ఇటుసూడు గంగీ!" అంటన్నడు రాజిరెడ్డి. తలతిప్పి "ఏందన్నట్టు" సూసింది ఆయన ముకంలకు.

"రాందాసు ఇయాల పనిమిదికి రాలే యాడికి బోయిండు?" అంటడిగిండు.

"జెరమొచ్చింది పటేలా! పొద్దుమీకటి సంది బుక్కెడు మెతుకులు సుతిమె ఎంగిలిసెయ్యలే. పెయ్య బాగా కాల్తున్నది" అన్నది గంగి

"అట్లనా? ఏదీ, సూతాం పా!"

గంగి లోపటికి నడిసింది. నల్లనాగుంబామసొంటి ఆమె జెడను, ఎత్తుగున్న ఆమె పిర్రలనుసూస్త ఎన్కనే బోయిండు రాజిరెడ్డి.

ఒక సిరుగుల్సాపమిద పండుకోని "అవ్వా. అయ్యా" అంట మూలుగుతున్నాడు రాందాసు. మెడెదాక గొంగడి కప్పి వున్నది. నెత్తికి సెవులను కలుపుత రుమాలు సుట్టున్నది. కండ్లు మూసుకోనున్నడు. నెత్తికింద ఒక మెత్తున్నది.

ఒక తాటి సాప కింద ఏసి – "కూసో పటేలా!" అన్నది గంగి.

ఆ సాపమిద కూసున్నడు రాజిరెడ్డి.

గంగి మొగని దగ్గరికి వోయి–'మామా అంట పిలిసింది.

రాందాసు కండ్లు తెరిసిండు. గయి రకుతం నింపినట్టు ఎర్రగున్నయి.

"ఏందే?" అంటడిగిండు సిన్నగా.

"మి పటేలొచ్చిండు మామా."అన్నది గంగి

పక్కకు సూస– "దండం పటేలా!" అంటన్నడు రాందాసు ఆయాసపడ్త గొంగడి జరిపి లేవబోయిండు.

"ఆ. ఆ........ ఎందుకుర లేస్తున్నవ్. వద్దు. పండుకో" అన్నడు రాజిరెడ్డి సేత్తి ఇశారసేస్త.

రాందాసు మల్లా పండుకున్నడు.

గంగి ఒక మూలకు నిలవడి వాండ్ల దిక్కు సూస్తున్నది.

రాజిరెడ్డి– "జెరం నిన్నటి సంది వచ్చినాది?" అంటడిగిండు రాందాసు ముకంలకు సూస్త

"అవ్, పటేలా! నిన్న పొద్దుమీకటాల కొచ్చింది. దూపగంజి తాంసీకి బోయి జీతగాండ్ల సోపతికి కూసున్న. ముత్యాలవ్వ అంబలి తెచ్చి గిన్నెల వోసింది. జెర తాగిన. వాంతి వచ్చినట్టయింది. నోరు సప్పసప్ప గన్పించింది. ఇగ తాగబుద్ధిగాలే. గద మోర్ల ఒల్కబోసి గుడిసె కొచ్చేసిన. సలిసలి వెటవటింది. గొంగడి బొంత కప్పుకోని అట్లనే పండుకున్న. పొద్దుగల సుతిమె అకలిగాలే. నెత్తిల గడ్డపారల్తో గుద్దినట్టయితున్నది." ఆయాసపడ్త మూలుగుతనే సెప్పిండు రాందాసు.

"ఇగో సూడురా రాందాసూ! నేను మస్నాకరోస్న మెదక్‌కు దోలి వయిదున్ని పిలిపిస్త తెల్లారె తలికి. వాడు మంచి మందులిచ్చి జెలి తక్వ పేస్తడు. నివ్వేం బయపడకు" అంట దయిర్నం సెప్పిండు రాజిరెడ్డి.

"ఏవిటికి, పటేలా! గియింత జెరం వుంటాది. అదే తక్వయితది. వయిదున్ని పిలిపిస్తే ఊకెయితాది. రూపాలు కుమ్మరియ్యాలె" అన్నడు రాందాసు.

"మల్ల ఎట్లకమ్మయి తదిరా? దేవుడొచ్చికమ్మిసేస్తడా?"

గంగి దిక్కుసూసి నగుతన్నడు రాజిరెడ్డి

రాందాసు మాటాడలె.

"పిచ్చోనిలెక్క సోచాయిస్త మనసు పాడుసేసుకోకు. నీకేం పర్వలే నేనున్నగద! ఎంత కర్సయిన పికర్లేమి. నీ పెయ్య ఉశారు గావాలె గంతనేసాలు. పెసదేమున్నదిరా? ఇయాలవస్తది. రేపు ఎల్లిపోతది మన రెక్కలు సల్లగుండాలెగనీ కావలిసినంత పైస కమాయించవచ్చు. ఏమంటవ్ రా?" అన్నడు రాజిరెడ్డి.

"నువద్దెనే. పటేలా!" అన్నడు రాందాసు.

"ఇను. నీ పెయ్య బాగసేపిచ్చ బారం నాది. ఎరికెయిందా?" ఆ మాటలకు రాందాసు మనసు తుర్తివడ్డది గంగికిగూడ జెర బలమచ్చినట్టయింది.

"నివ్వుండంగ నాకు పికరేందిపటేలా!" అంట నగబోయిండు రాందాసు. కాని దగ్గొచ్చింది. గంగిలేచి మొగనితాన కొచ్చి దొగ్గలమిద కూసున్నది. రెండు సేతుల్తో గదువ కిందకెల్లి కంటందాకా రాయవట్టింది.

రాజిరెడ్డి– "ఇగో, సూడు గంగి! పిన్నిరేపటిధాక జాగురత్తగా సూస్తువుండు. జెరం బాగున్నట్టున్నది. బువ్వ గిట తిని పిచ్చేవు సుమా! ఆకలంటడిగితే బర్రె పాలు కొనుక్కొచ్చి తాగిపియ్యి" అంట జేబులకెల్లి ఒక రూపాయి లోటు తీసిచ్చిండు.

"మంచిది పటేలా!" అన్నది గంగి.

"ఇగ నేను వోత మల్ల. మస్నాకరోన్ని మెదక్‌కు తోలియ్యాలెగద! అరే రాందాసూ! గొంగడి నిండ గప్పుకోని ఆయిగనిద్రబో" అంట సెప్పి ఎల్లిపోయిండు రాజిరెడ్డి.

"గీ పటేలు మనిసిగాడు. దెవుడు" అంటనుకున్నది గంగి మనసుల. గదే మొగనిత సెప్పింది జెర సేయినంక.

"అవ్ మల్ల" అన్నడు రాందాసు.

"అబ్బో. మి పటేలును పొగిడేతలికి సపొట్ట ఉబ్బిపోతున్నట్టున్నది కాదా మామా?" అంట నగింది గంగి గుబులు మరిసిపోయి

"ఊ" అంట మూలిగిండు రాందాసు.

మర్నాడు వయిదుడు వచ్చి, రాందాసు సెయ్య పరీచ్చసేసి, ఇంజీషనిచ్చి, మల్లి



రేపొచ్చి సూస్తనంట సెప్పి ఎల్లిపోయిండు.

వారం రోజులయినంక—

రాజిరెడ్డి మల్లా రాందాసు గుడిసెకు వోయిండు. గంగి సాప తెచ్చేసింది. దాని మీద కూసుంట ఇట్లడిగిండు—

"ఏంరా, రాందాసూ! పెయ్యి బాగయినట్టేనా? వయిద్దుడు దినాం వచ్చి మందిస్తున్నడా?"

"గా వయిద్దుని కడుపు సల్లగుండనీ పటేలా! బంగారమసొంటి మందు లిస్తున్నడు. జెరం ఎప్పుడో తక్వయింది. రోజూ రొండు గోలీలేసుకోమంట సెప్పిండు. గయి నిన్నటి సంది వాడుతున్న కడుపులకు, మంచిగ నిద్ర వస్తున్నది. జోరు ఆకలయితున్నది" అన్నడు రాందాసు.

"అట్లనా?"

"అవ్ పటేలా! రేపు వచ్చేటపుడు "తానీకు" సీస పట్టుకొస్తడట. గది తాగుతే వోయిన తాకతు సుతిమె తిరిగొస్తదట."

"ఐతె, మంచి మందులు ఇస్తున్నడన్నమాట. ఈయన అస్తవాసి శాన మంచిదిరా. కొనపానం వున్న మనుసులకు సుతిమె ఊపిరి వోసిండు. పట్నంల నలుగు రయిదు గురికి. అప్పటి సంది ఈయనకు మంచి పేరొచ్చింది మస్తు పైస కమాంచిండు. ఐనగని పిసరంతకూడ గర్వంలే." అన్నడు రాజిరెడ్డి.

"నువదైనే పటేలా! ఆయన మాటలే నా సగం జెరంను వొడగొట్టినయి" అన్నాడు రాందాసు.

"అచ్చ. ఇయాల మందుగోలీ వేసుకున్నవా మల్లి?"

"ఆ"

"యాది మరువకుంట యాలతోని వేసుకోవాలె. తానీకు ఇచ్చినంక తాగిసూడు. గది మంచి ఉశారి స్తది"

"మంచిది పటేలా! నివ్వు నన్నో కన్న కొడుకులెక్క సూసుకుంటున్నవ్. నీతాన ఊడిగెం సెయ్యటమే నాకు బాగ్గెం లెక్క. ఎన్నోరూపాలు కర్చుపెట్టినవ్ నా కోసానికి గందుకనే జెల్దిన జెరం కమ్మయింది. లేకుంటే నేనాగండంలకెల్లి గింతదొబ్బిన బయటవడుదునా?" రాందాసు కండ్లలనీల్లు నిలిసినయి. గయి కుషిత, ఇయానంత లోపటికెల్లి పొంగివచ్చిన నీల్లు!

"ఆ, దాందేమున్నదిగానీ — నీ కాల్లు సేతులు బాగుండాలె నాల్రోజులు ఎక్వ కష్టం సేసి ఆ రూపాలు నివ్వే తేర్పు కుంటవ్. నా జీతగాన్ని నేను ఆదుకోలేక పోతే ఇంకెవలాదుకుంటర్రా?" అన్నడాయన.

రాందాసు గంగి ముకంలకు గర్వంగ సూసిండు. గంగి సిన్నగా నగింది.

"అచ్చ. పనిమీదికి యెప్పటి సంది వస్తవ్రా?"

"అవటాల ఎలుండి సంది"

"అట్లయి తట్లాయె. నేను వస్త మల్ల" అంట లేసి ఓరగన్నుత గంగి దిక్కుసూసి గుడిసె దాటిండాయన.

ఆ రెయ్యి ఆయన మెత్తటి పరుపుమీద పండుకున్నడన్న మాటేగాని నిద్రవటలే. ఆయన మనసంత గంగి చుట్టూ తిరుగుతున్నది.

"తను ఎప్పుడయితే గంగిని సూసిండో అప్పటిసంది కంటికి కునుకురాలే. గది తన కండ్లలవడ్డ యాల్ల ఇసేశం! దాని పెయ్యి మిద ఎక్వ సొమ్ములు సుతిమె లేవు. మెడెల పసుపుతాడు, ఆ తాడుకు పుస్తె! సెవులకు గెంటీలు! కుడిసేతి సిటికెనేలికి ఒక ఎండి ఉంగ్రమున్నది. కాల్లకు పట్ట గొలుసులు, మట్టెలూ వున్నయి. గంతనే.

బట్టలు కూడ అంత పసందుగ లేవు! ఎటువచ్చీ దాని సక్కదనమంత కండ్లల, ముకంల, జెడల, పిర్రలనే నిలిసిపోయింది. దాని రూపాన్ని, రొమ్ములనూ మరిసిపోలేక పోతున్నడు తను. దినాం ఒకసారి గుడిసెకువోయి గంగిని సూడాలంటన్పిస్తున్నది. దాని పెయ్యితోని ఒకపారి ఆడుకోవాలన్పిస్తున్నది. అందుకు గది ఒప్పుకుంటదా? బంగారం బెడ్తనంట ఆస వెట్టాలె. రూపాలిస్తనంట బుదిగియ్యాలె. ఏమంటదో? రేపు వోయి అడిగిసూడాలె. గది ఒకయాల తను వచ్చి ఇట్లడిగిండంట రాందాసుకు సెప్తే? ఇంకే ముంటది? మర్నాటి సంది వాడు జీతం మిదికి బందయితడు. ఇంకోల్ల తనన్న వుండి రూపాలు తెచ్చి కట్టిఎల్లి పోతడు. ఇగ తన ముకం సూడడు. గంగి తనకు దక్కది. మల్లేం సెయ్యాలె?" అంట శాన సేపు సోచాయించిండు. కొనకు ఒక మంచి ఆలోసెన మెరిసింది మనసుల. ఆయనకు తుర్తి కలిగింది.

"అవ్, గిట్ల వలపన్నుతే గంగి తనకు సిక్కుతది" అనుకుంట కుషిత కండ్లు మూసుకున్నడు. ఆ యెన్క ఆయిగ నిద్ర బోయిండు.

తెల్లారింది—

సూరీడు వొడిసిండు—

జీతగాండ్లు రేగడి యేగిలి దున్ననీకి నాగండ్లు కట్టుకుంటున్నరు. ఎడ్లు కొట్టంకెల్లి వాండ్ల దిక్కు సూస్తున్నయి ఎప్పుడు ఇడుస్తరన్నటు? బర్లు, ఆవులు గిట్ల నెమరు పెడ్తున్నయి

రాజిరెడ్డి అరుగుమిద కూసోని పలగరతోని పండ్లు తోముకుంటున్నడు. ఆయన పక్కపొంటి ఒక ఇత్తడి శెంబుల నీలున్నయి. దాని పక్కకుపొంటే ఎర్రటి సాతె తువ్వాలున్నది.

రాందాసు తలుగులు తప్పించి ఎడ్లనిడిసిండు. జీతగాండ్లందరు నాగటి కాండ్లకు ఎడ్లు కట్టుకోవట్టిర్రు. రాందాసు తను గూడ రొండు ఎడ్లు నాగటి కాడికి కట్టుకోని—

"నివ్వు రావా పటేలా. దున్నుకం కాడికి" అంటడిగిండు.

"నేనా? బుక్కెడు మెతుకులు దినిపోత గనీ — నివ్వియాల దున్ననీకి బోవద్దురా?" అన్నడు రాజిరెడ్డి నోట్లకెల్లి పలగరపుల్ల తిసి పారేస్త.

"ఏమిటికి పటేలా? ఇంటికాడ ఇంకేమన్న పనున్నదా?"

"లేదు. నివ్వియాల పొరుగూరుకి పోవాలె" అంట సెప్పి జీతగాండ్ల దిక్కు సూస్త ఇట్లన్నడు—

"మిరు నాగండ్లు కొట్టుకపొండ్రిరా. పొద్దు నెత్తిమిది కొస్తున్నది. నాలుగెకురాల పొలం పొద్దు మికెతలికి దున్నెయ్యాలె. నేను మీ ఎన్కనేవస్త. మిరు ఎల్లి దున్నుపొండ్రి."

ఎంబడే నాగండ్లు వరుసతోని ఒకటెన్కటి ఎల్లిపోయినయి.

రాందాసు జోల్లు ఒదులుసేసి- కాడికెల్లి ఎడ్లను తప్పించిండు. కటుగొయ్యలకు కట్టేసిండు. గడ్డివాములకు బోయి ఒక వరిగడ్డిమోపుతెచ్చి వాటిముందట గాడిల పారేశిండు. గయిమత కురుసేసినంక రాజిరెడ్డి తానకివోయి ఎదురుంగ నిలవడ్డడు.

"ఇగో, సూడురా రాందాసూ!" అంటన్నడాయన.

"సెప్పు పటేలా!" అన్నడు రాందాసు.

"నీకు వడియారం ఎరికేనా?" అంటడిడాయన"

"ఆ, ఎరికే పటేలా! ఆడ మాకు సుట్టాలు సుతిమె వున్నరు" అన్నడు రాందాసు.

"గది దాటినంక 'సినూరు' అనే సిన్న పల్లెటూరున్నది. ఆ ఊరి పోలీస్ పటేలు పేరు ఎంకర్రెడ్డి. అయనకు మాకు దెగ్గరి సుట్టరీకమున్నది. ఆ ఊర్ల బోలెడు ఈత శెట్లున్నయి, గయ గీసి గవుండ్లోల్లు; ముస్తాజిర్లు నికాలస్ కల్లు అమ్ముతున్నరు. మి పటేల్ సానికి గది తాగాల్నంట బుద్ధి వుట్టిందట. నువు ఎల్లి తీస్కస్తావు!" అంట

డిగుంరు రాజిరెడ్డి తువ్వాలత ముకం తుడుసుకుంట

"అట్లనే పటేలా!" అన్నడు రాందాసు

"ఉండు మల్ల, రొండు మటి తాబేల్లిస్త. గయిగొంచబో" అంట ఇంట్లకువోయి తాబేల్లు తెచ్చిచ్చిండు రాజిరెడ్డి.

"ఎంక్రబెపికి నా పేరు సెప్పు. కల్లు ఆయన్నే ఇంతెజాం సేపిస్తడు. మనసుకు వటినాది!"

"ఆ" అన్నడు రాందాసు.

"ఇగో, ఈ ఐదు రూపాలు తీస్కో. బస్సుకిరాయిగిట కావాలెగద! సూడు, రేపు మొబ్బుల్లనే రావాలె ఈడపని శాను న్నది" అంట లోటు సేతిల వెటిండాయన.

"మంచిది పటేలా, కోడి కూసేటాలకు ఈడికి సేరుకుంట. ఇగపోత" అంట గుడిసెదిక్కు నడిసిండు రాందాసు.

కడపల్ల గంగి ఎదురయింది. శాట్ల బియ్యం సెరుగుతున్నది. అడుగుల సప్పుడిని ఆపి తలెత్తింది.

"ఏం మామా! దున్ననీకి బోవాలంట న్నవ్. పోలే?" అంటడిగింది.

"ఉహూ! పటేలు ఏరే పనిసెప్పిండు" అన్నడు రాందాసు సాపమిద కూసుంటు.

"ఏంది?"

"సెప్త ముందుగాల ముంతెడు మంచి నీల్లు తేపో బాగ దూపయితున్నది"

శాట కిందవెటి. నీల్లు తెచ్చిచ్చింది గంగి. గుటగుట తాగి ముంత కింద వెటిండు రాందాసు

"ఇగ సెప్పు మామా!" అంట మొగని పక్కపొంటే కూసున్నది గంగి.

"నేనియాల సీనూరు బోవాలె" అన్నడు రాందాసు.

"ఏమిటికి?"

"మా పటేల్ సానికి కల్లుమీద మనసు వడ్డదట. ఆడ నికాలస్ కల్లు దొరుక్తది. తీసుకొస్త."

"ఎప్పుడొస్తవ్ మల్లా?"

"రేపు మొబ్బుల్లనే."

జెరసేపు ఎవలూ మాటాడలే.

గంగి రాందాసు సెక్కిలిమీద సెయ్యేసి నెన్నుదురు నిమురత- "సూడు మామా!" అన్నది.

"ఏందే?"

"నువ్వులేక నాకు నిద్రవటది. మనసుల గుబులయితది. మీ పటేలుకు ఇంకో మనిసిని తోలుమంట సెప్పిరాపో. నివ్వింటి తానే ఉండిపో. పోకు మామా!"

"పనివడ్డప్పుడు పెయ్యొదాసుకుంటే ఎట్ల పెండ్లంను కరుసుకోని ఇంటితానె కూలవద్దే కడుపులకు బువ్వో?"

"అయితే, పోక తప్పదా మామా?"

"పోవాలె గంగీ. లేకుంటే బాగుంటాది. నివ్వేం బుగులువట్టకు. రేపు కోడి కూసేటాలకు వచ్చెయ్యనా! మా అంటే నివ్వు మూడు పెద కూరుకులు తీసవ్. గంతనే!"

"గట్లయితే, పోమల్ల"

"రెయ్యికి పయిలం సుమా! ఒక్కదాన్నున్ననట బుగులువడకు. మా బావ ఇంటికిబోయి సిన్న పోరిని తోల్కచ్చుకోని దగ్గర పండబెట్టుకో."

"అట్లనే"

"బస్సు వచ్చే యాలయింది. ఇగ నేను పోత. పయిలం" అంట మరోసారి సెప్పి దబదబా ఎల్లిపోయిండు రాందాసు, సేతిల తాబేలు వట్టుకోని.

అతడు కండ్లవడేదాక కడపల్లనె నిలవడి సూసి. మరుగుకాంగనే ఎనుదిరిగింది గంగి

ఆరెయ్యి—

ఉసిరికపల్లె నిద్రవోయింది.

రాజిరెడ్డి తెల్లటి ఆపారం తొడుక్కున్నడు దస్తురుమాలు నెత్తికి సుట్టుకున్నడు. సన్నటి ధోతి శానిగ సింగులు వోసి కట్టుకున్నడు. అర్రలకువోయి నిద్రవోతున్న పెండ్లంను తట్టి లేపిండు

ముత్యాలవ్వ కండ్లు నులుపుకోని— "యాడికి బోతున్నవ్, గింత రెయ్యి?" అంటడిగింది.

"నక్కలాయ. పొలంకాడ కుప్పలేదా? దాని తానకి కావలిబోతున్న. ఇయ్యాల్రేపు దొంగల బయం లెసున్నది. ముందుగలనే కరువుదినాలయె తూమెడు వడ్లు గిట్ల నలుసుకపోతే బాగుంటాది?" అంటన్నడు రాజిరెడ్డి.

"నువద్దెనెమల్ల. పండుకునేతాన పయిలంసుమా! ఎంబడి జీతగాళ్ళను తోల్కపో. దినాలు సూస్తే బాగలేవు. గది వొంగ సిమ్మ్కన సీకటిగద! పాములు, తేల్లు గిట్ల గట్ల పొంటి పండుకోనుంటయి. జెర సైరత బో!"

'మంచిదిగనీ—తులసి నిద్రవోయిందా?'

"ఆ."

"అచ్చ, తలుపు వెట్టుకో. ఇగ నేను పోత. మొబ్బుల్లనే లేసివస్త. కుప్పకొట్టనీకి కయికిలోల్లను పిల్వాలె" అంట ఈధి కడప దాటిండాయన.

ముత్యాలవ్వ తలుపులుమూసి, గొండ్లెం బెట్టుకుంది.

ఆమెత సెప్పినట్ల కుప్పకాడికి బోలే రాజిరెడ్డి. మాలపల్లె దిక్కు బయలెల్లిండు.

అయాల నిండు అమాస.

సీకట్లు జిమ్ము మంటున్నయి.

మొగుల్ల బడాయి సుక్కలే.

సుక్కలు సుతిమే ఎక్వలేవు.


రాజిరెడ్డి ఒక గుడిసె ముందట నిలవడి తలుపు తడ్త—"గంగీ" అంట మెల్లంగ పిలిసిండు.

"ఎవలూ?" అన్నది గంగి లోపటి కెల్లె.

"నేన గంగీ రాజిరెడ్డిని, జెర తలుపు తియ్యి"

గంగి తలుపు తెరిసింది.

(మిగతా 54వ పేజీ చూడండి)



## బలి

(23వ పేజి తరువాయి)

"నీ జీతగాడింక రాలే పటేలా!" అన్నది.

"నాకు ఎరికెనే లేయే. నేను వాడికోసానికి రాలే"

ఎందుకొచ్చినట్టు మల్ల ? గంగి గుండె టపటప కొట్టుకుంది.

రాజిరెడ్డి— "అగ్గిపెట్టె ఉంటే ఇయ్యి. సుట్ట కాల్చుకోవాలె" అంట జేబులకెల్లి ఒక సుట్ట తీసి పెదువుల సందున యిరికిచ్చిండు.

"అగ్గిపెట్టె లేదు పటేలా ?" అన్నది గంగి.

'దీపెమున్నదా?'

"ఆ"

"తీస్కరా పో !"

గంగి లోపటికి నడిసింది.

రాజిరెడ్డి ఎంబడే కడప దాటిండు. నడిగాకుంట తలుపు మూసి, గొండ్లెంబెటిండు. ఆ యెన్క పరుసుకున్న గొంగడి బొంత థానకి వోయి నిలవడ్డడు.

కచ్చెసందూక మీదికెల్లి సేతిల దీపెం పట్టుకొచ్చి, ఆయన ముందట నిలవడి — "ముట్టిచ్చుకో పటేలా!" అన్నది గంగి.

"అట్లనేగనీ — గుడిసెల ఒక్కదానివే పండుకున్నవ్. బుగులయితలే?" అన్నడు రాజిరెడ్డి.

"మా బాలయ్యన్న బిడ్డెను తోల్కనంట చెప్పిండు, దీపెలయాలకు. గింతకు మునుపేవచ్చి దానికి జెరమొచ్చింది. మంచిగ తలుపేసుకోని నివ్వేపండుకో. బుగులు వటకు" మంట సెప్పిపోయిండు. ఐనగని జెరజెర బయమయితున్నది పటేలా!"

"అట్లనా ?" పక్కుమంట నగిండు రాజిరెడి. నోట్ల సుటతనే.

గంగికి సగ్గయింది. తల దించుకుంది.

రాజిరెడ్డి రెండడుగులు ముందటికేసి. సుటముటించుకొనీకి మూతిదెగ్గర వెటినట్టే వెట్టి గంగి సెయ్యిగటిగ వట్టుకున్నడు.

సేతిల దీపెం జారిడిసి. ఎనక్కి జరిగింది గంగి.

రాజిరెడ్డి నోట్ల సుట్టతీసి కింద పారేసిండు

"గింత బయంవడ్తవేందే గంగీ?" అంట ఆమెను కాగలిచ్చుకో బోయిండు.

"మీ కాల్ల కాడ బతికేదాన్ని. కులాన మాలదాన్ని. మీ అసొంటి పటేండ్లకిది పనికిరాను" అంట ఆయన శాతిమీద సేతులు వెట్టి, అదిమి బలంతోనీ ఎన్కకు ఒక్క నూకు నూకింది గంగి.

ఎల్లెంకెల పడిపోయిండు రాజిరెడ్డి. ఆయిన నడుం విరిగిపోయినటయింది.

గంగి తలుపు కాడి కురికింది. వణుకుతున్న సేతుల్త గొండ్లెం దియ్యబోయింది.

ఇంతలకే, రాజిరెడ్డి సటుక్కున లేసి వచ్చి ఆమెను సెయ్యి వటుకొని దెగ్గరికి గుంజుకున్నడు ఆయన మనసుల ఆమెను నమిలి మింగుదామన్నంత కోపమున్నది.

"ఇడిసిపెట్టు పటేలా ! ఇడిసి పెట్టు" అంట సెయ్యి ఇడిపిచ్చుకోనీకి తండ్లాలింది గంగి.

ఆమె తండ్లాడిన కొదీ రాజిరెడ్డి పెయ్యి గరంగా వటింది. బలంత సందిట్లకు తీసుకోని ఆమె పెయ్యని గొంగడ బొంతమీద పండవెటనీకి తండ్లాడవటిం డాయన.

"నేనసొంటిదాన్ని కాను. నన్నిడిసిపెట్టు పటేలా ! నీకు దండం బెడ్త" అంట ఎంతన్న బతిమిలాడింది గంగి.

ఆయనమనసు కరుగలే.గిట్ట బుదిగియ్యి వటిండు—

"బెట్టుసెయ్యకు గంగీ! నీకు ఉగాది పండుక్కు పట్టుసీర కొనుక్కొస్త"

"నాకేం వద్దు పటేలా! నన్నిడిసిపెట్టు గంతనేసాలు. నీ కాల్మొక్కుత".

"బుగులువటకు గంగీ! నీ పానానికి నా పానం అడమేస్త. రాందాసేమింటదోనంట బయం వడుతున్నవా? వాడు నాసుదిల కుషి వడ్డడుగని ఇసారెపడడు నిన్నూ, వాన్నీ మంచిగ సుకపెడ్త" అంట గంగి పెయ్యని గొంగడిమీద పండవెట్టి మీదవడ్డడు రాజిరెడ్డి. ఆమె ఒర్రబోయింది. దొబ్బున ఎడంసేత్త నోరుమూసి. రుమాలుతీసి ఆమె నోట్ల గుక్కిండు ఆయన.

ఆమెకు మాటాడనీకి ఈలులేకుంట వోయింది.

ఆయన తన నల్లటి పెదువులను ఆమె ఎర్రటి సెంపమీద మోపిండు. ఇనుర్రవు తసొంటి ఆయిన శాతి ఆమె రొమ్ములను కాగలిచ్చుకుంది. రొండు సేతులూ ఆమె నడుంసుటూ బిగిసినయి.

తండ్లాడ, తండ్లాడి ఆమె ఎదిరిచ్చే సెక్తి తిని పొడగొట్టుకుంది. తోలు బొమ్మను బొమ్మలాటగాడు నలిపినట్ల రాజిరెడ్డి ఆమెను వాడుకోని, లేసిండు. నోట్లకెల్లి రుమాలు తీసి నెత్తికి సుట్టుకున్నడు. కోర్కె తీరిందనే కుషిత సిన్నగ నగిండు.

ఆమె— "క్యా......క్......క్యా......క్" మంట కొంర్రడిచ్చింది. ఉమబోయేటంతలకే రాజిరెడ్డి దొబ్బున గొండ్లెంతీసి, తలుపు తెరుసుకోని అవుతల్కి పారిండు.

ఎంగిలివడ్డ గంగి, మానం పొడగొట్టుకున్న గంగి బావురుమంట ఏడిసింది. నెత్తిని నేలకు కొట్టుకుంది జుట్టు పీక్కున్నది. పెయ్యంత కొరుక్కున్నది. కొనకు లేసి నిలవడ్డది. జెరసేపు సోవాయించింది, అయినంక అవుతల్కి పారి వటింది.

సర్రాసుగ మంజీర ఏరు థానకి పారి, ఏటి తడంచెమీద నిలవడ్డది. మనసుల గిట్లనుకున్నది—

"మామా ! నీకు అన్నేయం జరిగింది. నివ్వు పానం లెక్కసూసుకున్న నా పెయ్యి ఎంగిలివడ్డది — మైలయింది. గిది నివ్వు ఇంక ముట్టుకోనీకి పనికి రాదు. నా దరిద్రగొట్టు ముకం నీకు ఎట్ల సూపెటాలె మామా! అందుకోసానికే నీకు దూరమయితున్న. మల్ల జెల్మంల సుతిమె నివ్వా, నేనూ గిట్లనే పుటాలె, కాని మీ రాజిరెడ్డి పటేలసొంటి కావురం బట్టిన బాడ్కావు దెగ్గర నివ్వు జీతముండొద్దు. గంతనే" అంట కండ్లు మూసుకోని గలగలమంట పారుతున్న మంజీర తల్లికి దండంబెట్టింది. ఆయెన్క ఆనాదనం తంచెమీదికెల్లి నీల్లల్లకు దుంకేసింది. గంతనే! గంగి, గంగల కలిసిపోయింది.

★



అంచులకు డిజైన్